# ప్రజా ఆశీర్వాదం కోసం..

- మూడు జిల్లాలు.. నాలుగు సభలు
- రేపు జన నేత, సీఎం కేసీఆర్ రాక
- దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, గద్వాలలో భారీ బహిరంగ సభలు



దేవరకద్రలో సీఎం సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మహబూబ్‌నగర్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత.. ప్రగతి ప్రధాత సీఎం కేసీఆర్ ఈనెల 6న ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు మూడు జిల్లాల్లో, నాలుగు బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఒకే రోజు నాలుగు చోట్ల ప్రజాఆశీర్వద సభల్లో పాల్గొంటుండడంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నది. నామినేషన్ల ఘట్టం ఊపందుకున్న తరుణంలో పార్టీ అధినేత పర్యటనను ప్రతిష్టాత్మంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాగానే గత నెల 18న జడ్చర్ల పట్టణంలో భారీ బహిరంగ సభలో పాల్గొని ఉమ్మడి జిల్లాలో ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అదే నెల 26న అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లో పర్యటించి రాజకీయ వేడిని రగిలించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో, నారాయణపేట జిల్లా కేంద్రంతోపాటు మక్తల్‌లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకే రోజుల నాలుగు సభల్లో గులాబీ పార్టీ అధినేత అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తుండడంతో పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభలు నిర్వహించే స్థలాలను చదును చేసి హెలీప్యాడ్‌కు ఏర్పాట్లు ఫైనల్ చేశారు. నాలుగు చోట్ల పార్టీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచార సభలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తున్నారు. ఒకవైపు ప్రచారం చేస్తూనే మరోవైపు సీఎం సభకు జనసమీకరణ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు మండలాల వారీగా భారీఎత్తున కార్యకర్తలను తరలించేందుకు వాహనాలు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ జాబితాలు ప్రకటించడం.. అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడడంతో సీనియర్ నాయకులంతా గులాబీ దళంలో వచ్చి చేరుతుండడంతో అన్ని నియోజకవర్గాల్లో జోష్ కనిపిస్తున్నది. విపక్షాలకు దిమ్మతిరిగేలా సీనియర్లంతా కండువా కప్పుకోవడంతో రాజకీయ సమీకరణలు మారిపోయాయి. ఉమ్మడి జిల్లాలో మళ్లీ కారుజోరు పెరిగింది. ఈసారి కూడా ఉమ్మడి జిల్లాలో 2018 రిజల్ట్ రిపీట్ చేస్తామని నేతలు శపథం చేస్తున్నారు. కారు స్పీడ్‌కు కాంగ్రెస్, కమలం చతికిలపడుతున్నాయి.

**కాంగ్రెస్ అయోమయం..**

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సొంత జిల్లాలోనే లీడర్లు ఝలక్ ఇస్తున్నారు. పాలమూరు సెంటిమెంట్ అడ్డం పెట్టుకొని జిమ్మిక్కులు చేస్తున్న ఆ పార్టీకి షాక్ ఇస్తూ చాలామంది నేతలు కారెక్కారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో హస్తం పార్టీకి భారీ షాక్ తగిలింది. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన కాంగ్రెస్ నాయకుల ధనదాహన్ని సహించలేక ఆ పార్టీకి రాజీనామా చేసిన నాగం జనార్దన్‌రెడ్డి గులాబీ కండువా కప్పుకోవడంతో పాలమూరు రాజకీయాలు మలుపుతిరిగాయి. కేసీఆర్‌తో ప్రతిసారి విబేధించిన ఆయన తెలంగాణలో, సొంత నియోజకవర్గంలో కండ్ల ముందు జరిగిన అభివృద్ధిని చూసి గులాబీ గూటికి చేరారు. అంతే గౌరవంతో నాగంను మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వానించి ప్రగతిభవన్‌కు తీసుకెళ్లారు. నాగం చేరికతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి అదనపు బలం చేకూరింది. అంతకుముందే టీడీపీ సీనీయర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి కూడా మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. వనపర్తి జిల్లాలో తిరుగులేని నాయకులుగా ఉన్న మంత్రి నిరంజన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరూ ఒక్కటయ్యారు. దీంతో ఇక్కడ గెలుపు ఖాయమైపోయింది. బీజేపీలో మహబూబ్‌నగర్ అసెంబ్లీ సీటును ఆశించి భంగపడ్డ మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, జడ్చర్లలో కాంగ్రెస్ టికెట్ నిరాకరించడంతో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌లు కూడా కారెక్కారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారిపోయాయి. కాంగ్రెస్, బీజేపీలకు కొలుకోలేని దెబ్బ తగిలింది. కాంగ్రెస్‌లో టికెట్ రాకుంటే బీజేపీవైపు వస్తారనుకున్న పార్టీ నేతలకు వీరంతా షాక్ ఇచ్చి కారెక్కేశారు.

**ప్రచార సభలతో పెరుగుతున్న ఎన్నికల వేడి..**

అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడం.. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఒకే రోజు నాలుగు బహిరంగ సభల్లో పాల్గొననుండడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వేడి మరింత రగలింది. ఇప్పటికే పార్టీ అభ్యర్థులను ప్రకటించడం.. ప్రచార పర్వాన్ని ప్రారంభించడంలో బీఆర్ఎస్ అన్ని పార్టీల కంటే ముందుంది. ఇప్పటికే మూడు నియెజకవర్గాలను చుట్టివచ్చిన పార్టీ అధినేత మరో నాలుగు నియోజకవర్గాల్లో ప్రచారపర్వంలో పాల్గొననుండడంతో మరింత జోష్ పెరిగింది. నామినేషన్ల ఘట్టం ముగియగానే మిగితా నియోజకవర్గాల్లో కేసీఆర్ సభలను ఏర్పాటు చేయడానికి పార్టీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట సభలతో మొత్తం ఏడు నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ ప్రచారం పూర్తవుతుంది. మరో ఐదు నియెజకవర్గాల్లో పర్యటించాల్సి ఉంది. నామినేషన్ల ఘట్టం పూర్తయ్యాక ప్రచార సభల్లో పాల్గొనే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. 6న నిర్వహించే ప్రజాఆశీర్వద సభలను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఏర్పాట్లను చేస్తున్నారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని సభను విజయవంతం చేసేందుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి జనసమీకరణ చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ రాకతో ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీలో మరింత జోష్ కనిపిస్తున్నది.



దేవరకద్రలో సీఎం కేసీఆర్ బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- రేపు దేవరకద్రకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాక
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర, నవంబర్ 4 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం దేవరకద్రలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వద సభకు రానున్నారు. ఇందుకు సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నాటికి ఏర్పాట్లను పూర్తి చేనున్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభాస్థలాన్ని సిద్ధం చేయడంతోపాటు వేదిక నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సభకు వచ్చే వాహనాలను సైతం ఎక్కడికక్కడే పార్కింగ్ చేసేలా దేవరకద్ర సమీపంలో స్థలాలను సిద్ధం చేశారు. సభా స్థలాని ఎస్పీ హర్షవర్ధన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సభకు సంబంధించి చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు భారీగా తరలిరానున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు జనసమీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయావెంకటేశ్, ముడా డైరెక్టర్ రాజు, సహకార సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ యాదవ్, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, అంజి, సత్యంసాగర్, రాము, చల్మారెడ్డి, సయ్యద్ జక్కీ, రాధాకృష్ణ, పురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**వరదలా నిధులు..**

మూసాపేట, నవంబర్ 4 : పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో పేరు కూడా లేని కర్వెనను సర్వే చేయించి, నివేదికలతో వెళ్లి చెప్పడంతో సీఎం కేసీఆర్ ఒప్పుకొన్నారు. ప్రాజెక్టులో భాగంగా కర్వెన ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.3,300కోట్లు మంజూరు చేయడంతోపాటు, 98శాతం పనులు కూడా పూర్తి చేయించారు. అదేవిధంగా మరో రూ.109కోట్లు ఖర్చు చేస్తే 25వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పగా, నిధులు మంజూరు చేశారు. వాగులపై 30 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.190కోట్లు మంజూరు చేశారు. పూడూర్ లిఫ్ట్ కోసం రూ. 55కోట్లు, దేవరకద్రలో 100 పడకల దవాఖాన, కొత్తకోటలో 30 పడకల దవాఖానకు నిధులు మంజూరు చేశారు.

- సాగునీటితో సస్యశ్యామలం
- ప్రజలకు చేరువైన పరిపాలన

# చెప్పాడంటే.. చేస్తాడంతే

నారాయణపేట, నవంబర్ 4 : 2018 నవంబర్ 23 ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేటకు వచ్చిన సీఎం కేసీఆర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే నారాయణపేటను జిల్లా చేస్తానని, జయమ్మ చెరువుకు నీళ్లు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు ఆ ఎన్నికల్లో నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. ఎన్నికలు పూర్తి కాగానే ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం కేసీఆర్ నారాయణపేటను జిల్లాగా చేశారు. అంతేకాకుండా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాల్వ పనులకు టెండర్లు కూడా పూర్తి చేయించారు. త్వరలోనే కాల్వ పనులు ప్రారంభం కానున్నాయి. ఇవి పూర్తయితే జయమ్మ చెరువుకు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు రానున్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన రెండు హామీలను నేరవేర్చిన సీఎం కేసీఆర్ ఈసారి ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నారాయణపేటకు రానున్నారు. 6వ తేదీన నారాయణపేటలోని క్రీడామైదానంలో నిర్వహించే బహిరంగ సభలో మళ్లీ ఏం హామీలు ఇస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

# రెండో రోజు ఏడు నామినేషన్లు

- జడ్చర్లలో ట్రాన్స్‌జెండర్ నామినేషన్

మహబూబ్‌నగర్ నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో నామినేషన్ల పర్వం మందకొడిగా సాగుతోంది. రెండో రోజు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. జడ్చర్ల నియోజకవర్గం నుంచి ఓ ట్రాన్స్‌జెండర్ నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది. కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి తరపున రాఘవేందర్ నామినేషన్ దాఖలు చేశారు. నారాయణపేటలో బీజేపీ అభ్యర్థి రతంగ్ పాండురెడ్డి నామినేషన్ అందజేశారు. అలంపూర్‌లో బీఆర్ఎస్ తరపున ప్రేమలత నామినేషన్ వేశారు. కొల్లాపూర్‌లో ఆలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ నుంచి గుంటి విక్రమ్, స్వతంత్ర అభ్యర్థిగా ఆదిరాల యాదన్నగౌడ్, వనపర్తి నియోజకవర్గం నుంచి ఆలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫారమ్స్ పార్టీ నుంచి కుందేళ్ల అర్జున్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాగా, జడ్చర్ల అసెంబ్లీకి జానకమ్మ అనే ట్రాన్స్‌జెండర్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈమె రాష్ట్రీయ సామాన్య ప్రజాపార్టీ తరపున దాఖలు చేసినప్పటికీ ఆ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు లేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా పరిగణించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండో రోజు నామినేషన్ వేసిన వారితో కలిపి సంఖ్య 13కు చేరింది. కాగా, సోమవారం నుంచి నామినేషన్లు పుంజుకునే అవకాశం ఉంది.

# అభివృద్ధి అద్భుతహో..

- నడిగడ్డ ప్రజలకు కేసీఆర్ అంటే నమ్మకం
- 2018 జనవరి 8న 'తుమ్మిళ్ల'కు శంకుస్థాపన
- రూ.162కోట్లతో పదినెలల్లో పూర్తి..
- 2018 డిసెంబర్ 27న గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన
- శరవేగంగా గట్టు ఎత్తిపోతల పనులు
- రూ.13.50కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం
- ఇచ్చిన హామీలను వడివడిగా అమలు చేసిన గులాబీ బాస్
- సాగునీటి గోస తీర్చిన దేవుడు



గద్వాలలో నిర్మించిన మెడికల్ కళాశాల



శరవేగంగా కొనసాగుతున్న గట్టు ఎత్తిపోతల పథకం పనులు

- ఎన్నికల హామీలు నెరవేర్చిన సీఎం కేసీఆర్

గద్వాల, నవంబర్ 4 : గత పాలకుల నిర్లక్ష్యం, ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన నడిగడ్డ, రాష్ట్ర ఏర్పాటు తర్వాత అద్వితీయంగా అభివృద్ధి చెందుతున్నది. పచ్చని పైర్లు, విద్య, వైద్యపరంగా అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతున్నది. కేవలం ఎన్నికల హామీలకే పరిమితమైన తుమ్మిళ్ల లిఫ్ట్, గట్టు ఎత్తిపోతల పథకం, గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణాలకు రాష్ట్ర ఏర్పాటుతోనే బీజం పడింది. కేసీఆర్ మాట అంటే నడిగడ్డ ప్రజలకు నమ్మకం, హామీ ఇస్తే నెరవేర్చే వరకు శ్రమించే నాయకుడు, నడిగడ్డ వాసుల సాగునీటి గోసతోపాటు విద్య, వైద్య సమస్యలు తీర్చి వారికి అండగా నిలిచిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్. 2002లో జోగుళాంబ గద్వాల జిల్లాలో పాదయాత్ర చేసిన సమయంలో ఆర్డీఎస్ చివరి అయకట్టుకు నీరు అందించి అలంపూర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ముఖ్యమంత్రి నడిగడ్డకు వచ్చిన సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలుపై ప్రత్యేక కథనం.

**మాట నిలబెట్టుకున్న సీఎం..**

ఉద్యమ సమయంలో 2002 జూలై 20న కేసీఆర్ గద్వాల జిల్లాలో చేపట్టిన పాదయాత్ర ఫలితంగానే నేడు తుమ్మిళ్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. సుంకేసుల బ్యారేజీని సందర్శించి తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చూసి కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు ద్వారా తెలంగాణకు 15.9టీఎంసీల నీటి కేటాయింపు ఉంటే తెలంగాణ ప్రజలు 4టీఎంసీలకు మించి వాడుకోలేదు. ఈక్రమంలో రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తుమ్మిళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని ఆయన అప్పుడే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ సీఎం అయ్యాక 2018 జనవరి 8న ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.162కోట్లతో మొదటి విడత పనులు షురూ కాగా అధికారులు, కాంట్రాక్టర్ల సహకారంతో 8 నుంచి పది నెలల్లో పనులు పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రతి ఏటా తుంగభద్రానదిలో 3.69 టీఎంసీలు నీరు ఉన్నన్ని రోజులు ఎత్తిపోసుకునేలా చర్యలు తీసుకున్నారు. 'తుమ్మిళ్ల' ప్రారంభంతో ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు నీరు అందడంతో రైతులు సంతోషిస్తున్నారు.

**పుట్టి ప్రయాణానికి చెక్..**

గద్వాల మండలంలో దివిగ్రామంగా పిలిచేది గుర్రంగడ్డ. వర్షాకాలం వస్తే ఈ పల్లెకు ఇతర గ్రామాలతో సంబంధాలు నిలిచిపోతాయి. వారికి ఆపదొస్తే పుట్టి ప్రయాణమే దిక్కు. ఈ గ్రామాన్ని గతంలో తమకు ఓటేస్తే బ్రిడ్జి ఏర్పాట్లు చేస్తామని నమ్మించారే తప్పా.. అమలుకు నోచుకోలేదు. కాగా 2018 ఎన్నికల సమయంలో కేసీఆర్ గద్వాలకు వచ్చిన సమయంలో గుర్రంగడ్డకు బ్రిడ్జి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 2018లో గులాబీ పార్టీ మళ్లీ అధికారంలోకి రాగా, గద్వాల ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గెలువడంతో గుర్రంగడ్డ వాసుల కల నెరవేరింది. సీఎం ఇచ్చిన హామీ మేరకు అదే ఏడాది డిసెంబర్ 27న బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేయగా ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఇది పూర్తయితే ఆ ఊరి ప్రజల ఎన్నో ఏండ్ల కల నెరవేరినట్లే.

**గట్టు ఎత్తిపోతలతో 'గద్వాల' సస్యశ్యామలం..**

గట్టు ఎత్తిపోతలను గత పాలకులు ఎన్నికల నినాదంగా ఉపయోగించుకున్నారే తప్పా ప్రాజెక్టు నిర్మించి నీటిగోస తీర్చలేదు. తమను గెలిపిస్తే ఎత్తిపోతలను పూర్తి చేసి నియోజకవర్గ చివరి భూములకు నీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పిన మేరకు పనులు ప్రారంభించగా వేగంగా కొనసాగుతున్నాయి.

**రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు..**

సీఎం కేసీఆర్ గద్వాలకు వచ్చిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేయగా, జిల్లా కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు పార్కులను అభివృద్ధి చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, ఇండోర్ ఆడిటోరియం, జూరాల ప్రాజెక్టు వద్ద బృందావన్ గార్డెన్, సంగాల పార్కు వద్ద మినీట్యాంక్ బండ్ ఏర్పాటు, పీజీ కళాశాలకు నూతన బిల్డింగ్, వసతి గృహ నిర్మాణం, మున్సిపాలిటీలో బీటీరోడ్ల నిర్మాణం, నూతన ఆర్టీసీ బస్టాండ్, ఆర్వోబీ, నూతన నర్సింగ్ కళాశాల నిర్మాణం, సెంట్రల్‌లైటింగ్, వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టారు.

**మెడికల్ కళాశాల మంజూరు..**

సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ.13.50కోట్లు మంజూరు చేశారు. అదేవిధంగా 100 పడకలు ఉన్న ఏరియా దవాఖానను జిల్లా దవాఖానగా మార్చి 300 పడకలకు అప్‌గ్రేడ్ చేయగా, పనులు చివరి దశలో ఉన్నాయి.

**అలంపూర్ నియోజకవర్గంలో..**

తుంగభద్ర పుష్కరాలకు వచ్చిన సమయంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారు. 100 పడకల దవాఖాన ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయగా, ప్రస్తుతం ప్రారంభిచుకున్నాం. అలంపూర్ చౌరస్తాలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు సహకరించారు. ఇలా 'నడిగడ్డ'కు కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో జిల్లావాసులకు నమ్మకం ఏర్పడింది.

కృష్ణానదిపై కొనసాగుతున్న గుర్రంగడ్డ బ్రిడ్జి పనులు



# కాంగ్రెస్‌కు అధికారమిస్తే.. తెలంగాణ అంధకారం

- దొంగ సర్వేలతో ప్రజలను మభ్యపెడుతున్నరు
- తెలంగాణలోని పరిశ్రమలను కర్ణాటకకు తరలిస్తరు
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- మీడియాతో ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 4 : పొరపాటున కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని అంధకారం చేయడమేకాకుండా తెలంగాణ పరిశ్రలనింటినీ కర్ణాటకకు తరలిస్తారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సయ్యద్ ఇబ్రహీం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో నెలకొల్పనున్న ఐఫోన్ పరిశ్రమ తరలించుకుపోయేందుకు కర్ణాటక ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. దొంగ సర్వేలతో ప్రజలను అయోమయానికి గురిచేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 60ఏండ్లు అధికారంలో ఉండి పాలమూరును కరువు జిల్లాగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఏండ్లుగా దగాపడ్డ పాలమూరును సీఎం కేసీఆర్ హయాంలో పచ్చబడిందని, మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

**టికెట్లు అమ్ముకుంటున్నరు..**

కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలు, మైనార్టీలకు ఇవ్వాల్సిన టికెట్లను అమ్ముకొని తీవ్ర అన్యాయం చేసినట్లు మైనార్టీ నాయకుడు ఇబ్రహీం విమర్శించారు. పార్టీ కోసం పని చేసే వారిని కాదని, డబ్బులిచ్చే వారికి టికెట్లు కేటాయించడం దారుణమన్నారు. ఇలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీలో డబ్బులున్న వారికి హూ ఆర్ యూ అని, లేని వారిని వూ ఆర్ యూ అని అడుగుతారని మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. సర్వేల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్న బీజేపీ తీరా కేటయింపుల్లో వివక్ష ప్రదర్శించిందన్నారు. బీసీలను సీఎం చేస్తామని ప్రగల్బాలు పలికి కనీసం ఎమ్మెల్యే టికెట్ కూడా కేటాయించలేదన్నారు. అనంతరం బీజేపీ సోషల్ మీడియాకు చెందిన యువకులు సుమంత్ ముదిరాజ్, భవానీశంకర్, శరత్‌తోపాటు 50మంది యువకులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్‌రెడ్డి, కౌన్సిలర్లు రవికిషన్, కిశోర్, నాయకులు రాములు, రాజేశ్వర్, శివరాజ్, పురుశోత్తం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో మైనార్టీ నేత ఇబ్రహీం, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్

# అభివృద్ధి పరుగులు

- మక్తల్ నియోజకవర్గంలో ఊహించని అభివృద్ధి
- ఎన్నికల హామీలను నెరవేర్చిన సీఎం కేసీఆర్



మక్తల్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూర్, నవంబర్ 4: అభివృద్ధి ప్రధాత.. సీఎం కేసీఆర్ మక్తల్ నియోజకవర్గంలో 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డిసెంబర్ 4న మక్తల్ గడ్డపై సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలో భాగంగా ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కోసం మక్తల్ నియోజకవర్గంలోని 5 మండలాలు, పేట, కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాలను కలిపి మొత్తం 13 మండలాలతో నారాయణపేటను జిల్లాగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 2లక్షల ఎకరాల సాగు నీటి సౌకర్యం కల్పించారు. సీఎం సహకారంతో పట్టణంలో 150 పడకల ప్రభుత్వ దవాఖాన, ఫైర్‌స్టేషన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పెద్ద ఎత్తున గురుకుల విద్యాలయాలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించారు. 99శాతం గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం, హైలెవల్ వంతెనల నిర్మాణం పనులను పూర్తి చేశారు. గత ఎన్నికల సందర్భంగా ఊట్కూర్ మండలానికి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరందించేందుకు సీఎం హామీ ఇచ్చారు. పనులు యుద్ధ ప్రాతిపదికన ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయో పరిమితి 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచడంతో మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 9, 600 మంది ఉద్యోగులకు లబ్ది చేకూరింది. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల మరమ్మతుతో నిండు కుండను తలపిస్తున్నాయి. మత్స్య కార్మికులకు ఉచితంగా చేప పిల్లలు, పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించడంతో మత్స్య సంపద గణనీయంగా పెరిగి మత్స్యకారులు ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలనన్నింటికీ నెరవేర్చారు.

**నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు..**

నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేశారు. సర్వేల అంచనాలను తలకిందులు చేస్తూ జిల్లాలోనే అత్యధికంగా 45వేల చిలుకు మెజార్టీ సాధించి హ్యాట్రిక్ విజయం సాధించారు. ప్రజా సేవే లక్ష్యంగా ఇదే నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరుపున నాలుగోసారి చిట్టెం పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

**రేపు ప్రజా ఆశీర్వాద సభ..**

ఎన్నికల పర్యటనలో భాగంగా మక్తల్‌లో సోమవారం) నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. మక్తల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పట్టణంలోని ఎల్లమ్మకుంట (గుర్లపల్లి రోడ్డు) సమీపంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభ నిర్వహించిన స్థలంలోనే ఈ సారి ప్రజా ఆశీర్వాద సభా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. లక్ష మందితో సభను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జన సమీకరణ, వాహన సౌకర్యం కోసం చర్యలు తీసుకుంటున్నారు.